'ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి'

ఎల్లారెడ్డి, జూన్ 8 : ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి పోలీసు స్టేషన్‌లో భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్, ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. వచ్చే బక్రీద్ పండుగకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జరుపుకోవాలని పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు ఆటంకం కలిగించకుండా ఉండాలని, లేనిచో చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎస్సై మహేష్, నాగిరెడ్డిపేట ఎస్ఐ రాజు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లు వద్ద బయటే ఉన్న ధాన్యం

- రైస్‌మిల్లు ఆరుబయటే ధాన్యం సంచుల కుప్పలు
- మిల్లుల్లో ధాన్యం నిల్వలకు చోటు కరువు
- గత యాసంగి, వానాకాలం సీజన్‌ల సీఎంఆర్ ధాన్యం మిల్లుల్లోనే..
- సరిపడా గోదాంలు లేక ఎదురవుతున్న సమస్య
- ఈ సీజన్‌లో కొనుగోలు చేసే ధాన్యాన్ని మిల్లుల బయటే నిల్వలు
- ధాన్యానికి రక్షణ కల్పించడం కష్టమంటున్న మిల్లుల యజమానులు
- ఈ యాసంగిలో 3.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

గోదాంలు ఖాళీ లేవు..

మిల్లుల్లో చోటు లేదు!

కామారెడ్డి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైస్‌మిల్లుల్లో గత యాసంగి, వానాకాలం సీజన్‌లకు సంబంధించిన సీఎంఆర్ ధాన్యం కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. సీఎంఆర్ ధాన్యం, రైస్ మిల్లుల్లో, గోదాంల్లో ఎక్కడికక్కడే నిల్వలు అలాగే ఉండిపోయాయి. రాష్ట్ర గిడ్డంగులు, ఎఫ్‌సీఐ గోదాంలు ఖాళీ కాకపోవడంతో మిల్లుల్లో కస్టం మిల్లింగ్ ధాన్యం సంచులు నిల్వలు అలాగే ఉండిపోవడంతో ఈ యాసంగి సీజన్ ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు మిల్లుల్లో చోటు లేకుండా పోతోంది. ఈ యాసంగి సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు మిల్లుల్లో చోటు లేకుండా పోతోంది. ధాన్యాన్ని రైస్‌మిల్లుల బయట దింపుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుందని రైస్‌మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం, ఎఫ్‌సీఐ నుంచి సకాలంలో వ్యాగన్లు రాక మిల్లుల్లో, గోదాముల్లో గత సీజన్‌లకు సంబంధించి ధాన్యం అలాగే ఉండడంతో అధికారులు, మిల్లర్లు యాసంగి ధాన్యం నిల్వ చేయడంపై అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 3.17లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి ఆయా మిల్లులకు తరలించారు.

జిల్లాలో 200లకు పైగా రైస్‌మిల్లులు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో 200లకు పైగా రైస్‌మిల్లులు ఉన్నాయి. ఇందులో 135 రా రైస్‌మిల్లులు ఉండగా 35 పైగా బాయిల్డ్ రైస్‌మిల్లులు ఉన్నాయి. జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో ఎక్కువగా రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసే ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌మిల్లులకు కేటాయిస్తోంది. ఈ మిల్లుల్లో ఇప్పటికే గత వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించి ధాన్యం నిల్వలు అలాగే ఉండిపోయాయి. మరోవైపు గోదాంలు కూడా ఖాళీగా లేవు. జిల్లాలో రెండు చోట్ల మాత్రమే ఎఫ్‌సీఐ గోదాంలు ఉన్నాయి. ఈ గోదాంల్లో సైతం సీఎంఆర్ నిల్వలు పేరుకుపోయాయి. ఎఫ్‌సీఐ నుంచి సకాలంలో వ్యాగన్లు రాకపోవడంతో ఈ గోదాంల్లో నిల్వలు ఖాళీ కావడం లేదని సంబంధిత శాఖ అధికారులు, రైస్‌మిల్ వ్యాపారులు చెబుతున్నారు.

వేలం పాటలో దక్కించుకున్న ధాన్యాన్ని లిఫ్ట్ చేయని వ్యాపారులు

జిల్లాలో గత యాసంగి, వానాకాలం సీజన్‌లకు సంబంధించింది కూడా ధాన్యం మిల్లుల్లోనే ఉండిపోయింది. 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి మెట్రిక్ టన్నుల ధాన్యంను కొనుగోలు చేసి మిల్లులకు కేటాయించారు. అయితే ఇందులో కొంతమేర మిల్లర్లు సీఎం రైస్‌ను ప్రభుత్వానికి అప్పగించారు. ఇటీవల ప్రభుత్వం మారడంతో మిల్లుల్లో ఉన్న ధాన్యానికి వేలం వేసింది. ఈ వేలం పాటలో కొందరు వ్యాపారులు పాల్గొని ధాన్యాన్ని దక్కించుకున్నారు. అయితే దక్కించుకున్న వ్యాపారులు మిల్లుల నుంచి ధాన్యాన్ని లిఫ్ట్ చేయడం లేదు. ఆ సీజన్‌కు సంబంధించి ధాన్యం మిల్లులోనే ఉండిపోతోంది. ఇక 2023-24 వానాకాలంకు సంబంధించి రైతుల నుంచి 4.44 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు కేటాయించారు. ఇందుకు గాను మిల్లర్లు 2.99 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్‌ను తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. ఇందులో 8 శాతం ప్రభుత్వానికి మిల్లర్లు అప్పగించారు. ఈ సీజన్ ధాన్యం కూడా మిల్లుల్లోనే ఉండిపోయింది.

ఖాళీగా లేని గోదాంలు

జిల్లాలో ఎఫ్‌సీఐ గోదాంతో పాటు సాధారణ గోదాంలు సుమారు 35కు పైగానే ఉన్నాయి. ఈ గోదాంలో ఎఫ్‌సీఐ సంస్థయే అధిక కెపాసిటీ గల ధాన్యం నిల్వలే ఉంటాయి. జిల్లాలోని కామారెడ్డి శివారులోని గత కలెక్టరేట్ సమీపంలో 15వేల మెట్రిక్ టన్నుల, నర్సన్నపల్లి వద్ద 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఎఫ్‌సీఐ గోదాంలు మాత్రమే ఉన్నాయి. వీటితో పాటు బాన్సువాడలో ఎఫ్‌సీఐ గోదాంలు ఉన్నాయి. వీటిలో ఇప్పటికే సీఎంఆర్ బియ్యం నిల్వలతో నిండిపోయాయి. ఇక మిగితా గోదాంలు ఎరువుల నిల్వలతో నిండిపోయాయి. కామారెడ్డిలోని 4 ఎఫ్‌సీఐ గోదాంలు గత కొన్ని రోజుల నుంచి ఖాళీగా లేవు. ఈ గోదాంలోని సీఎంఆర్ రైస్‌ను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు కొన్ని రోజులుగా వ్యాగన్లు రాక అలాగే ఉండిపోతున్నాయి.


ఈ యాసంగిలో 13.17లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో ఈ యాసంగి సీజన్‌లో చేపట్టిన ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తయ్యాయి. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకై 350 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల నుంచి 55,222 మంది రైతుల నుంచి రూ.698.75 కోట్ల విలువ చేసే 3,17,181 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని ఆయా బాయిల్డ్ రైస్‌మిల్లులకు కేటాయించారు. అయితే రైస్‌మిల్లుల్లో గతంలో యాసంగి, వానాకాలం సీజన్‌లకు సంబంధించి ధాన్యం నిల్వలు ఉండడంతో ఈ సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యం భద్రపరిచేందుకు రైస్‌మిల్లర్లు తర్జనభర్జన పడుతున్నారు. మిల్లుల్లో స్థలం లేక బయట ఆవరణలో దింపుకోవాల్సి వస్తోందని వర్షాలు పడితే ధాన్యానికి రక్షణ ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సీజన్‌లకు సంబంధించి ధాన్యాన్ని మర ఆడించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మర ఆడించిన సీఎంఆర్‌ను వెనువెంటే ఎఫ్‌సీఐ సేకరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మిల్లర్లు కోరుతున్నారు.

లోక్‌అదాలత్ ద్వారా శాశ్వత పరిష్కారం

జిల్లా న్యాయాధికారి వరప్రసాద్

కామారెడ్డి టౌన్, జూన్ 8: లోక్‌అదాలత్ ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా న్యాయాధికారి వరప్రసాద్ తెలిపారు. శనివారం కామారెడ్డి జిల్లా కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో 3,819 కేసులకు శాశ్వత పరిష్కారం లభించినట్లు తెలిపారు. ఇందులో క్రిమినల్ కేసులు 3,793, సివిల్ 19, పీఎల్‌సీ 7, సైబర్ క్రైమ్ కేసులు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ఉన్న క్రిమినల్ కేసులను సత్వర పరిష్కారం దిశగా ప్రయత్నిస్తున్నట్లు దీనికి అందరి సహకారం ముఖ్యంగా పోలీసుల పాత్ర ముఖ్యమైందని తెలిపారు. న్యాయవాదులు సమస్య పరిష్కారం దిశగా కక్షిదారులకు ఇద్దరికి సమ న్యాయం దిశగా అడుగు వేయాలని తెలిపారు. గతంలో హైదరాబాద్ ఫ్యామిలీ కోర్టులో భార్యాభర్తల కేసుని ఆయన పరిష్కరించడంతో సుప్రీంకోర్టు సైతం అభినందించిందని తెలిపారు. అలాగే అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో ఆ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్, సుధాకర్, దీక్ష, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు రాజగోపాల్‌గౌడ్, నిమ్మ దామోదర్‌రెడ్డి, అశోక్, శివరాం తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయాధికారి వరప్రసాద్

ఎల్లారెడ్డిలో 511 కేసులు పరిష్కారం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 511 కేసులు పరిష్కారమైనట్లు న్యాయాధికారి హరిక తెలిపారు. పరిష్కారమైన కేసులలో క్రిమినల్ 47, ఆస్తి తగాదాలు 1, ఎక్సైజ్ 28, పీటీ 407, సైబర్ నేరాల కేసులు 29 పరిష్కారమైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ చిన్నచిన్న వివాదాలకు కక్షలు పెంచుకుని కేసులు పెట్టుకోవద్దన్నారు. కేసుల వల్ల సమయం వృథా అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్, సాయి ప్రకాష్, దేశ్‌పాండే, సతీష్, నవీద్, పండరి, ఎస్ఐ రవీందర్ నాయక్, ఎస్ఐ మహేష్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే.. రాజ మార్గం..!

బాన్సువాడ టౌన్: రాజీ మార్గమే.. రాజ మార్గమని, సత్వరమే కేసులు పరిష్కారం అవుతాయని బాన్సువాడ న్యాయాధికారి కుమారి టీఎస్పీ భార్గవి అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 267 కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోయేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మూర్తి, న్యాయవాదులు ఖలీల్, రాంరెడ్డి, కోర్టు సిబ్బంది తదితరులు ఉన్నారు.

గ్రూప్-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కామారెడ్డి రూరల్, జూన్ 8: టీజీపీయస్సీ ద్వారా ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్.కె.డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఇన్విజిలేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 9:00 గంటల నుంచి 10:00 గంటల వరకు అభ్యర్థులను అనుమతించాలని ఉదయం 10:00 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాలులోనికి అనుమతించవద్దని స్పష్టం చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

బీబీపేట: మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహిస్తున్న మహిళాశక్తి టైలరింగ్ కేంద్రాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వారా మహిళలతో స్కూల్ యూనిఫాం కుట్టించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఒక్క రోజుకు ఎన్ని యూనిఫాంలు కుడుతారని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మురళి, డీపీఎంలు సుధాకర్, సురేష్, ఏపీఎం బాల పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పదిలమేనా?

- జిల్లాలో విచ్చలవిడిగా బహుళ అంతస్థుల భవనాల్లో పాఠశాలల నిర్వహణ
- అనుమతులకు, నిర్మాణాలకు పొంతన కరువు
- చాలా పాఠశాలల్లో అగ్నిమాపక అనుమతులు అంతంత మాత్రమే
- కనీస జాగ్రత్తలు పాటించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- మరో 4 రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం
- నిర్లక్ష్యంపై అధికారులు స్పందించేనా?

కామారెడ్డి టౌన్, జూన్ 8: జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలలు బహుళ అంతస్తుల భవనాల్లో కనీస రక్షణ లేకుండా కొనసాగుతున్నాయని విద్యార్థి సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రతీ పాఠశాలకు అగ్నిమాపకశాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాల్సి ఉండగా, ప్రైవేట్ యాజమాన్యాలు పట్టించుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 170కి పైగా ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో పదుల సంఖ్యలోనే పాఠశాలలకు అగ్నిమాపకశాఖ అనుమతులు ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా ప్రైమరీ సెక్షన్‌తో పాటు హైస్కూళ్ల వరకు 2-4 అంతస్తుల్లో తరగతులు బోధిస్తున్నారు. ఈ బిల్డింగ్‌ల పైకి విద్యార్థులు పుస్తకాల బ్యాగులు వేసుకుని ఎక్కాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ముగియగానే విద్యార్థులందరూ ఒకేసారి తమ బ్యాగులతో తోసుకుంటూ కిందికి దిగుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక మరికొన్ని పాఠశాలలకు కిటికీలకు ఇనుప రాడ్లు, డోర్లు లేకపోవడం కొన్ని పాఠశాలలకు పై అంతస్తులో పిట్టగోడలు సైతం లేకపోవడం గమనార్హం. వేల రూపాయల్లో ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం కనీసం విద్యాశాఖ ధికారులైన పాఠశాలలోని లోపాలను గమనించి చర్యలు చేపట్టకపోవడం విస్మయానికి గురి చేస్తోంది.

అనుమతులతో సంబంధం లేకుండా నిర్మాణాలు

పాఠశాల భవన నిర్మాణాల్లో ఆయా పాఠశాలలు అనుమతులు ఒక విధంగా తీసుకుని నిర్మాణాలను మరో విధంగా చేపడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెండస్తుల నిర్మాణానికి అనుమతులు తీసుకుని అంతకుమించి అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో పై అంతస్తులకు లిఫ్టులు ఉన్నా అవి కేవలం సిబ్బంది, యాజమాన్యానికి మాత్రమే వినియోగిస్తున్నారు. విద్యార్థులు మాత్రం పై అంతస్తుల్లోకి బరువులు మోస్తు ఎక్కాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని విద్యార్థి సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పదుల సంఖ్యలో ఈ తరహ బిల్డింగ్‌లు ఉన్నాయని ఏ ఒక్క పాఠశాలకు అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు లేవని పేర్కొంటున్నారు.

అగ్నిమాపక శాఖ అనుమతులు కరువు

జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలు అగ్నిమాపక శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండడంతో పాటు ప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి అగ్నిమాపకశాఖ జారీ చేసిన నియమ నిబంధనలను ఆయా విద్యా సంస్థలు పాటించాల్సిన అవసరముంది. ఆ నిబంధనల ప్రకారమే పాఠశాలల భవనాలు నిర్మించుకోవాలి. ప్రతీ ఏడాది అగ్నిమాపక శాఖ నుంచి అన్ని విద్యా సంస్థలు ఎన్‌ఓసీ సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉంటుంది. పాఠశాలలు మరో 4 రోజుల్లో ప్రారంభం అవుతున్నా ఇప్పటి వరకు ఎక్కువ శాతం పాఠశాలలు అసలు ఆ అంశంపైనే దృష్టి సారించడం లేదని ఇంకొన్ని పాఠశాలలకు ఏళ్ల తరబడి అసలు అగ్నిమాపక శాఖ అనుమతులు అనేవే లేవని విద్యార్థి సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. ఏదైన అనుకోని ప్రమాదం జరిగాక స్పందించేకంటే తక్షణమే అగ్నిమాపక, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



చేప మందు కోసం వెళ్లి మృతి

సిరికొండ జూన్ 8 : ఉబ్బసం వ్యాధి కోసం ప్రతి ఏడాది హైదరాబాద్‌లో ఇచ్చే చేప మందు కోసం వెళ్లిన మామిడి రాజన్న(60) తొక్కిసలాటలో కింద పడిపోయి చనిపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి సిరికొండ మండలం రామడుగు గ్రామానికి చెందిన మామిడి గొల్ల రాజన్న తన మనుమడితో కలిసి హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మృగశి కార్తె రోజు ఉబ్బసం వ్యాధికి ఇచ్చే చేపమందు కోసం శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ వెళ్లారు. శనివారం ఉదయమే ఆరున్నర -ఏడు గంటల సమయంలో క్యూలో ఉన్న వారిలో తొక్కిసలాట జరుగడంతో రాజన్న కింద పడిపోయాడు. అక్కడ ఉన్న పోలీసులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా రాజన్న చికిత్స పొందుతూ మరణించాడు. వెంట ఉన్న మనుమడు రాజన్న శవాన్ని స్వగ్రామానికి తీసుకరాగా బంధువులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య శనివారం అంతక్రియలు నిర్వహించారు. రాజన్నకు భార్య చిన్న సాయమ్మ, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కుటుంబసభ్యులు రాజన్న శవాన్ని చూసి బోరున విలపించారు. గ్రామంలో విశాదశ్చాయలు నెలకొన్నాయి.

● ప్రభుత్వం ఆదుకోవాలి

ఉబ్బసం వ్యాధి నయం చేసుకోవడానికి చేపమందు తీసుకోవడానికి వెళ్లి చనిపోయిన రాజన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కటుంబ సభ్యులు కోరుతున్నారు. ముగ్గురు ఆడపిల్లల తండ్రి కావడంతో పాటు ఆయన కుటంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సామూహిక కుంకుమార్చన పూజలు

మోపాల్, జూన్ 8:నగర సమీపంలో ఉన్న బోర్గాం(పి) లక్ష్మిగణపతి ఆలయంలో శనివారం సామూహికంగా కుంకుమార్చన, పూజలు ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజుల నుంచి ఆలయ ప్రాంగణంలో శ్రీ సూక్త సహిత శ్రీ లక్ష్మి మహా యాగములో భాగంగా వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగానే మహిళలు ఆలయ ప్రాంగణంలో సామూహికంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సమాజంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఈ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు అరుణ్‌శర్మ తెలిపారు. ఈనెల 7వ తేదీ నుండి 9వ తేదీ వరకు ఈ యాగము, హోమంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు వేదపండితుల సమక్షంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ నగర భక్తులే కాకుండా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని తెలిపారు. ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని అన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో మూకుమ్మడి తనిఖీలు

పెద్దబజార్, జూన్ 8:ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీల కోసం ఏర్పాటు చేసిన వైద్య శాఖ బృందాలు ఒకవైపు జిల్లా అంతటా జల్లెడ పట్టాయి. నగరంలో మాత్రం ఇప్పటి వరకు ఏ ఒక్క ఆసుపత్రిలో తనిఖీలు చేయలేదు. కేవలం ఐఎంఏ ఇచ్చిన నివేదికను యదావిధిగా ప్రభుత్వానికి పంపాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఈ అంశం వైద్య వర్గాల్లో చర్చకు దారి తీసింది. నగరంలో పలు ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేకపోగా ముఖ్యంగా కొందరు కనీస అర్హతను లేకుండానే వైద్యం చేస్తున్నారని అన్నారు. మల్టీ స్పెషాలిటీ బోర్డులు ఏర్పాటు చేసి స్థాయికి మించి వైద్యం అందించి రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ విషయాన్ని కొందరు క్వాలిఫై వైద్యులు సైతం తప్పుపడుతున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలు చేయాలని ఆదేశించింది. దీంతో వైద్య అధికారులు కొన్ని రోజులుగా ఆర్మూర్, బోధన్‌తో పాటు అన్ని చోట్ల ప్రైవేటు ఆసుపత్రులు ఆర్ఎంపీ, పీఎంపీ క్లీనిక్‌లలో తనిఖీ చేశారు.


తనిఖీలు చేస్తున్న అధికారులు

ఇక్కడ మాత్రం ఎందుకిలా...

నగరంలో కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. పలు ఇండ్లను ఆసుపత్రిలుగా మార్చారు. వైద్యులు కానీ వారు సైతం మల్టీస్పెషాలిస్టు పేరిట ఆసుపత్రులను నెలకొల్పారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు 50 శాతం చొప్పున కమిషన్‌లు ఇచ్చి పేద రోగుల నుంచి ముక్కుపిండి వారి వద్ద నుంచి అధిక ఫీజులు దోచుకుంటున్నారు. ఈ విషయంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వద్ద అనేక ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ సూచనలతో పకడ్బందీగా తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎలాంటి తనిఖీలు చేయకుండానే ఐఎంఏ నివేదికతో మమా అనిపించే యోచనలో ఉన్నారు. నగరంలోని ఆసుపత్రుల్లో క్షేత్రస్థాయి తనిఖీల కోసం 20 బృందాలను ఏర్పాటు చేయగా ఎవరూ కూడా తనిఖీలకు వెళ్లలేదని అధికారులు ఆదేశాలు ఇవ్వడం ఇందుకు నిదర్శనం.

నగరంలో పలు ఆసుపత్రుల్లో తనిఖీలు...

నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులు మెడికవర్, కోనార్క్, లైఫ్‌లైన్ ఆసుపత్రులలో శనివారం డీఎంహెచ్‌వో బృందం, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజన, హెచ్‌సీవో సంతోష్, హెచ్ఏ రఘు, శ్రీధర్‌లు తనిఖీలు చేశారు.

బ్రెయిన్ ట్యూమర్ చాలా ప్రమాదకరమైనది

పెద్దబజార్, జూన్ 8: బ్రెయిన్ ట్యూమర్ చాలా ప్రమాదకరమైన వ్యాధి అని మెడికవర్ ఆసుపత్రి న్యూరో సర్జన్ డాక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. శనివారం నగరం లోని ఎల్లమ్మగుట్టలో గల మెడికవర్ ఆసుపత్రిలో ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం అందరం కలిసి మెదడు కణితుల ద్వారా ప్రభావితమైన వారి జీవితాల్లో మార్పు చేయ వచ్చని అన్నారు. బ్రెయిన్‌లోని కణితుల సమీపంలో కనజాల ను నిర్మాణంలో వచ్చే గడ్డలు, కణాల పెరుగుదలను బ్రెయిన్ ట్యూమర్ అంటారు. వీటిలో కొన్ని క్యాన్సర్‌తో సంబంధం లేనివి, మరికొన్ని క్యాన్సర్‌తో సంబంధం ఉన్నవి అని అన్నారు. బ్రెయిన్ ట్యూమర్ సమస్య రోజురోజుకు పెరుగుతుంది. దీర్ఘకాలం పాటు రేడియేషన్‌కు గురైె వ్యక్తులు, పొగ తాగే వ్యక్తులు బ్రెయిన్ ట్యూమర్‌లను అభివృద్ధి చేసే ప్రమాదం ఎక్కువగా ఉంటుంద న్నారు. ఒక వ్యక్తి బ్రెయిన్‌లోని ట్యూమర్ రకం పరిణామం, స్థానం పెరుగుదల రేటు ప్రకారం మార్పులు ఉంటాయని అన్నారు. వీటి లక్షణాలను గుర్తించడం కష్టమని ఎందుకంటే అవి ఇతర అనారోగ్య సమస్యలైఉంటాయని అన్నారు.


న్యూరోసర్జన్ డాక్టర్ కృష్ణ ఆదిత్య

వ్యాధి లక్షణాలు...

తలనొప్పి, తలలో ఒత్తిడి, ఉదయం సమయంలో తీవ్రమైన తలనొప్పి, పడుకున్నప్పుడు తలనొప్పి ఎక్కువగా రావడం, వికారం, వాంతులు, ఏవైనా రెండుగా కనిపించడం జరుగుతుందన్నారు.

లోక్‌అదాలత్‌తో ఇరువర్గాలకు సమ న్యాయం

న్యాయ సేవా సంస్థ చైర్ పర్సన్, జిల్లా న్యాయాధికారిణి సునీత


చెక్కు అందజేస్తున్న న్యాయాధికారిణి

నిజామాబాద్ లీగల్, జూన్ 8:లోక్‌అదాలత్‌తో ఇరువర్గాలకు సమన్యాయం జరుగుతుందని న్యాయ సేవా సంస్థ చైర్ పర్సన్, జిల్లా న్యాయాధికారిణి సునీత కుంచాల అన్నారు. నిజామాబాద్ జిల్లా కోర్టులో శని వారం జిల్లా జాతీయ లోక్ అదాలత్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ లోక్‌అదాలత్‌కు ముఖ్య అతిథిగా న్యాయసేవా సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయాధికారిణి సునీత కుంచాల హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదాపు 12 కోట్లకు పైగా కక్షిదారులకు నష్టపరిహారం అందించినట్లు తెలిపారు. మొత్తం 16వేలకు పైగా కేసులను రాజీకి కుదిర్చారని ఇందులో క్రిమినల్ కేసులు 6,500, మోటార్ యాక్సిడెంటల్ కేసులు 30, బ్యాంక్‌అండ్ సివిల్ కేసులు 9వేలు, మొత్తం 11 బెంచీలలో ఇరువర్గాల కక్షిదారులతో రాజీకి కుదిర్చి కేసులు కొట్టివేయడం జరిగిందని అన్నారు. 1984లో 10 కోట్ల భూనష్ట పరిహార కేసు నారాయణరావు వేయగా దాంట్లో కలెక్టర్ లోక్‌అదాలత్‌లో 6కోట్ల 11లక్షల 12,111 రూపాయల చెక్కును జిల్లా జడ్జి కక్షిదారుడికి అందజేశారు. మిగతా బ్యాంక్, ఇన్సూరెన్స్ కేసులలో 6కోట్లకు పైగా వివిధ కక్షిదారులకు నష్టపరిహారం అందజేయడం జరిగింది. అనంతరం రెండవ అదనపు న్యాయాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ కక్షిదారులు కేసులను రాజీ కుదుర్చుకోవడంతో వారికి సమయంతో పాటు మనశాంతి కూడా దొరుకుతుందని అన్నారు. అంతేకాకుండా దీనిద్వారా సమన్యాయం జరుగుతుందని తెలిపారు. జేసీ కిరణ్‌కుమార్, ఏసీపీ రాజా వెంకట్‌లు మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవా సంస్థ ఏర్పాటు చేసిన జాతీయ లోక్‌అ దాలత్ లో కక్షిదారులకు మా వంతు కృషి సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్, జూనియర్ సివిల్ జడ్జిలు గోపికృష్ణ, కుష్బు చటోపాధ్యాయ, శ్రీనివాస్, చైతన్య, జీపీ శ్రీహరి ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తల పంచాయితీ.. ఇరువర్గాల దాడి

ఖిల్లా, జూన్ 8: నగరంలోని 6వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఢైరీఫారం తాజ్‌దాబా వద్ద భార్య తరపున బంధువులను భర్త దాడి చేసిన ఘటన శనివారం చోటుచేసుకున్నట్లు ఎస్సై మొగులయ్య తెలిపారు. బోధన్‌లోని ఫతేపూర్ గ్రామానికి చెందిన సభాబేగంను నిజామాబాద్ నగరంలోని ఆటోనగర్ ప్రాంతానికి చెం దిన సయ్యద్ అలీతో వివాహం జరిగింది. వీరికి ఒక కు మారుడు, కూతురున్నారు. ఐదు సంవత్సరాల కాలంలో భార్యభర్తల మధ్య తీవ్ర మనస్పర్థలు వచ్చాయని నాలుగు సార్లు కుల పెద్దలతో పంచాయతీ పెట్టించడం జరిగిందని సభాబేగం తండ్రి సయ్యద్ యూసుఫ్ తెలిపారు. ఈ క్రమంలో భర్తతో గొడవపడిన సభాబేగం పుట్టింటికి తొమ్మిది నెలల క్రితం వచ్చిందని అన్నారు. శనివారం భార్యభర్తల పంచాయతీ మరోసారి కుల పెద్దల వద్దకు రావడంతో ఇద్దరిని సముదాయించి గొడవలు పడకుండా కలిసిమెలసి ఉండాలని సూచించారు. పంచాయతీ అనంతరం ఇంటికి వెళ్లే క్రమంలో భార్య తరపున బంధువులపై భర్త కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడ్డ క్షతగ్రాతుడిని చికిత్స నిమిత్తం బంధువులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సయ్యద్ అలీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలుడిపై పిచ్చికుక్కల దాడి

జక్రాన్‌పల్లి, జూన్8: బాలుడు తాత ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా అటు వైపు నుంచి వస్తున్న పిచ్చికుక్కలు ఒక్కసారిగా బాలుడిపై దాడి చేశాయి. దీంతో బాలునికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం జక్రాన్ పల్లి మండలం చందమియాబాగ్‌తాండా గ్రామంలో బానవత్ దీరాజ్ ఐదేళ్ల బాలుడు తన తాత బానవత్ దారసింగ్ ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఒక్కసారిగా పిచ్చికుక్కలు దాడి చేశాయి. పిచ్చికుక్కలు దాడి చేయడంతో బాలుడు దిరాజ్ తలకు బలమైన గాయాలయ్యాయి. ఈ ఘటన చూసి తాండా గ్రామస్థులు అక్కడికి చేరుకొని కుక్కలను చెదరగొట్టి బాలుడిని కాపాడారు. తల్లిదండ్రులు బానవత్ విరేంధర్ బాలుడు దిరాజ్‌ను చికిత్స నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా తీవ్రగాయాలైనందున అక్కడి నుంచి వైద్యులు నిజామాబాద్‌కు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడికి దీరాజ్ తలకు సర్జరీ చేయాల్సి ఉందని వైద్యులు తెలిపినట్లు బాలుని తల్లిదండ్రులు, గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుడు దీరాజ్ చికిత్స పొందుతున్నాడు.

పిచ్చికుక్కల బెడద నుంచి రక్షించాలి....

మండలంలోని వివిధ గ్రామాల్లో పిచ్చికుక్కడ బెడద అధికమైంది. గ్రామాల్లో ఏటుచూసిన కుక్కలు గుంపులు గుంపులుగా కనిపిస్తున్నాయి. చిన్నపిల్లలు రోడ్డు వెంట వెళ్తే కుక్కలు ఎప్పుడే ఏం చేస్తాయో తెలియక పిల్లల తల్లిదండ్రులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తిరుగుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ


దుస్తులతో క్రీడాకారులు

ఆర్మూర్‌రూరల్, జూన్8: ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ తరఫున బెహరన్‌లో హైదరాబాద్ యువకుల క్రికెట్ జట్టు సభ్యులకు శనివారం క్రీడా దుస్తులను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ రాజారెడ్డి మాట్లాడుతూ రాకేష్‌రెడ్డి ఫౌండేషన్, వివిధ సంస్థల ద్వారా, విదేశాల్లో ఉన్న వారికి సహాయం అందజేస్తు న్నామని వారు తెలిపారు. గల్ఫ్‌లో మృతి చెందిన వారి మృతదేహాలన సొంత గ్రామాలకు చేర్చడానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గల్ఫ్ దేశాల్లో సైతం సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

హోటళ్లపై అధికారుల తనిఖీలు

సుభాష్‌నగర్, జూన్ 8:రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు నగరంలోని పలు హోటళ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి ఎలాంటి సమాచారం లేకుండా హోటళ్లపై దాడులు నిర్వహించారు. నగరంలోని ప్రధాన హోటళ్లపై ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు నిర్వహించి హోటళ్లలో కుల్లిన ఆహారంపై ఫినాయిల్ పోశారు. నగరంలోని అరోమ, వంశీ, తదితర హోటళ్లపై తనిఖీలు నిర్వహించి కిచెన్‌లోని పరిస్థితులను పరిశీలించారు. నగరంలో గత కొన్ని రోజులుగా మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా దాడులు నిర్వహించిన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు ఉదయం నుంచి తనిఖీలు నిర్వహించి పలు హోటళ్లపై చర్యలు తీసుకున్నారు. కుల్లిన మాంసాన్ని చెత్తబుట్టలో పారేశారు. లోకల్‌గా ఉన్న ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండానే రాష్ట్ర అధికారులు నేరుగా తనిఖీలు నిర్వహించడంతో హోటల్ యజమానులు అవాక్కయ్యారు. దాడులు కొనసాగుతున్నాయన్న సమాచారంతో మిగతా హోటళ్లలో ఉన్న పాడైపోయిన వాటిని ముందే తీసివేశారు. ఈ తనిఖీల్లో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు పాల్గొన్నారు.


తనిఖీలు చేస్తున్న అధికారులు



మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ

'కార్మికులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తాం'

కామారెడ్డి టౌన్, జూన్ 8: కార్మికులకు అన్ని రకాల సౌకర్యాలు అందిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. శనివారం ఉదయం మున్సిపల్ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు కావాల్సిన పనిముట్లతో పాటు సౌకర్యాలు అందేలా చూస్తానని తెలిపారు. ఏ సమస్యనైన తన వద్దకు తీసుకురావాలని తెలిపారు. అదేవిధంగా ఎస్పీ సింధూశర్మను సైతం కలిసి ట్రాఫిక్ సమస్యలపై వివరించి తగిన సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు పాత శివకృష్ణమూర్తి, చాట్ల వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బీర్కూర్‌లో కుట్టు పనులను పరిశీలిస్తున్న డీపీఎం రవీందర్

స్కూల్ యూనిఫాంలను సిద్ధం చేయాలి

బీర్కూర్, జూన్ 8: పాఠశాలలు పునఃప్రారంభం నాటికి విద్యార్థుల యూనిఫాంలు సిద్ధం చేసి అందించాలని డీపీఎం రవీందర్ అన్నారు. శనివారం ఆయన బీర్కూర్ మండల కేంద్రానికి విచ్చేశారు. విద్యార్థుల యూనిఫాంల కుట్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించడానికి టైలరింగ్ వారికి వస్త్రాలను ఇచ్చామన్నారు. ఈ మేరకు కుట్టు పనులు సాగుతున్నాయని తెలిపారు. స్కూల్ ప్రారంభం నాటికి యూనిఫాంలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీర్కూర్, నసురుల్లాబాద్, జుక్కల్ మండలాలకు సంబంధించిన విద్యార్థుల యూనిఫాంలు బీర్కూర్‌లో కుడుతున్నారని తెలిపారు. ఆయన వెంట ఏపీఎం గంగాధర్ సిబ్బంది ఉన్నారు.



టీటీడీలో శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం

బీర్కూర్, జూన్ 8: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన వేంకటేశ్వర స్వామి వారిని అమ్మవార్లను శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. స్వామి వారికి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఇదిలా ఉండగా ప్రకాష్‌రావు క్యాంప్‌కు చెందిన ఒక భక్తుడు ఆలయ సన్నిధిలో శ్రీవారి కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న భజరంగ్ దళ్ విశ్వహిందూ పరిషత్ సభ్యులు

'గోవధ చట్టాన్ని అమలు చేయాలి'

ఎల్లారెడ్డి, జూన్ 8 : అక్రమంగా తరలిస్తున్న గోవులను రక్షించి గోవధ జరగకుండా చూడాలని గోవధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని శనివారం ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, ఎస్ఐ మహేష్, నాగిరెడ్డిపేట్ ఎస్ఐ రాజుకి విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఎల్లారెడ్డి శాఖ తరఫున వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా భజరంగ్‌దళ్ జిల్లా సహ సంయోజక్ వినోద్, ఎల్లారెడ్డి సంయోజక్ భారత్, తులసీదాస్, గోరక్ష రాహుల్, నాగసాయి, చరణ్, బన్ని పాల్గొన్నారు.

బాన్సువాడలో కురిసిన వర్షం

బాన్సువాడ టౌన్, జూన్ 8: బాన్సువాడ పట్టణంలో శనివారం సాయంత్రం ఓ మోస్తారుగా వర్షం కురిసింది. జూన్ మొదటి వారంలోనే వర్షం కురియడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా వాతావరణం సైతం చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా మృగశిర కార్తె



కోమట్‌పల్లిలో ఎడ్లబండ్లతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

లింగంపేట, జూన్8: మండలంలోని కోమట్‌పల్లి గ్రామంలో శనివారం దుర్గమ్మ ఆలయం వద్ద ఎడ్ల బండ్ల ప్రదక్షిణను ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఏటా మృగశిరకార్తె నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తారు. మొదటిరోజు ఎడ్లబండ్లు, ఆదివారం బోనాలు, సోమవారం కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. మృగశిర కార్తె సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మంచి వర్షాలు కురిసి, గ్రామం పాడి పంటలతో చల్లగా చూడాలని వారు అమ్మవారిని వేడుకున్నారు. సోమవారం నిర్వహించే కుస్తీ పోటీల్లో గెలు పొందిన మల్లయోధునికి ఐదు తులాల వెండి కడియం బహుమతిగా ఇస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలో భక్తులు శనివారం భక్తి శ్రద్ధలతో మృగశిర కార్తెని జరుపుకున్నారు. భక్తులు శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రైతు లు భూమాతకు పూజలు చేసి ఏరువాక పనులు ప్రారంభించారు. చేప లు తినాలనే సంప్రదాయం కారణంగా మండలంలో చేపలకు డిమాండ్ పెరిగింది. సాధారణ చేపలు రూ.150 కేజీకి విక్రయించగా మొట్ట చేపలు కేజీ రూ.600ల నుంచి 800లకు విక్రయించారు. వేడి నుంచి రక్షణకు ఇంగువ బెల్లాని స్వీకరించారు.

నిజాంసాగర్: మృగశిర కార్తె సందర్భంగా ఉమ్మడి మండలాల్లో రైతులు పంట పొలాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం రైతులు పంట పొలాలకు వెళ్లి విత్తనాలు చల్లి వరుణుడు కరుణించాలని పూజలుచేశారు. పాడిపంటలు పుష్కలంగా పండి అంద రూ సుఖసంతోషాలతో ఉండేలా దేవుడు చల్లగాచూడాలని వేడుకున్నారు.



భోజన కార్మికుల యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

'పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి'

బాన్సువాడటౌన్, జూన్ 8: ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల మాదిరిగానే ఈ ప్రభుత్వం మధ్యాహ్నభోజన కార్మికులకు బిల్లులు చెల్లించకుండాఇబ్బంది పెడుతోందన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ కార్మికుడికి రూ.10వేలు, మౌలిక వసతులు కింద ప్రతీ పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని, పాఠశాలల్లో నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 11న బాన్సువాడ ఆర్డీవో ఆఫీస్ ముందు బైఠాయించి ధర్నా చేపడతామన్నారు. ఈ సమావేశంలో బాన్సువాడ ఇన్‌చార్జి దుబాస్ రాములు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు ఉన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

రామారెడ్డి, జూన్8: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని సీఆర్పీ మహమూద్ తెలిపారు. రామారెడ్డి మండలం గోకుల్ తండా గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలను, విద్యను తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సక్కుబాయి, యాదయ్య, అంగన్‌వాడి టీచర్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

బడిబాట పోస్టర్ విడుదల

కామారెడ్డి టౌన్, జూన్8: బడీడు పిల్లలకు బడిలో చేర్పించాలని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి పిలుపునిచ్చారు. తపాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలను కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా సంస్కారవంతమైన విద్యను పొందుతూ ప్రభుత్వ వ్యవస్థను బలోపేతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లు కూడా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాఘవరెడ్డి, రామచంద్రం, ఆంజనేయులు, రాజశేఖర్, సంతోష్, బాలకిషన్, దత్తాచారి, నర్సింలు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

నీట్ ర్యాంకర్లకు సన్మానం

బాన్సువాడటౌన్, జూన్8: ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో బాన్సువాడ నుంచి ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శనివారం బీజేపీ నాయకులు, కాంగ్రెస్ మాజీ వార్డు సభ్యుడు అక్బర్ ఘనంగా సన్మానించారు. బాన్సువాడ ఆర్టీసీ డిపోలో కండరక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అంబాజీ కుమారుడు కార్తీక్, తబస్సుమ్, తుబ, వహీర, సకీనాలు నీట్‌లో ఉత్తమ ర్యాంకులను శాలువా కప్పి సత్కరించారు. విద్యార్థులు భవిష్యత్తులో బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, బాన్సువాడ పేరు ప్రఖ్యాతులు తీసుకరావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నాగిరెడ్డిపేట, జూన్8: మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన కోరబోయిన హరీష్ (24) గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బొల్లారం గ్రామానికి చెందిన కోరబోయిన హరీష్ అదే గ్రామానికి చెందిన అమ్మాయిని ప్రేమించి గత ఆరు నెలల క్రితం ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నట్లు తెలిపారు. పెళ్లి జరిగినప్పటి నుంచి భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేసేవాడని తెలిపారు. కళ్యాణలక్ష్మీ పథకానికి దరఖాస్తు చేసేందుకని నాలుగురోజుల క్రితం గ్రామానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. హరీష్ చిన్నచిన్న విషయాలను మనసులో పెట్టుకుని తనలో తాను బాధపడుతుండేవాడని తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో కాలకృత్యాలకని వెళ్లిన హరీష్ రాత్రివరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతని కోసం వెతకగా గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తండ్రి నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

రామోజీకి ఘన నివాళులు

బీర్కూర్, జూన్8: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. ఈ మేరకు బీర్కూర్ మండల కేంద్రంలో కమ్మ సంఘం సభ్యులు రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బీర్కూర్‌లో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

బస్వాపూర్‌లో చేపలు పట్టడానికి వెళ్లి ఒకరి మృతి

భిక్కనూరు, జూన్ 8: భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామంలో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఒకరు మృతిచెందినట్లు ఎస్సై సాయికుమార్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన గంగాధరి స్వామి (46) చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలోని పటేల్ చెరువులో ఎప్పటిలాగే చేపలు పట్టడానికి వలవేసి చేపలు పడుతుండగా కాళ్లకు ప్రమాదవశాత్తు చేపల వల కాళ్లకుచుట్టుకుని మృతిచెందాడు. ఈ మేరకు జాలర్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి మృతుడి భార్య సుధారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జీజీహెచ్‌కు తరలించారు.

నాణ్యతకు తిలోదకాలు!

● బీటలు వారుతున్న పెద్దతడుగూర్ రోడ్డు



పెద్దతడుగూర్‌కు వేసిన రోడ్డు బీటలు వారుతున్న దృశ్యం

మద్నూర్, జూన్ 8: కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న రహదారులకు మున్నాళ్లకే బీటలు వాడుతున్నాయి. మారుమూల గ్రామాల్లో రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. మద్నూర్ మండల కేంద్రం నుంచి తడుగూరు వరకు గత ఏడాది 15 కోట్లతో వేసిన రోడ్డుకు పగుళ్లు ఏర్పడ్డాయి. గత ప్రభుత్వం హయాంలో రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమై ఏడాది వరకు పనులు జరగకపోవడంతో అప్పట్లో ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి పనులను ప్రారంభింపజేశారు. ఆరు నెలల లోపే పనులు హడావుడిగా పూర్తి చేయడంతో నాణ్యత లోపించి రోడ్డుకు బీటలు వారుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్లకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ నాణ్యత లోపంతో పనులు చేయడం వల్లనే రోడ్లు మళ్ళీ అధ్వాన్నంగా తయారవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాబోయే వర్షాకాలంలో వర్షాలకు రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యే విధంగా కనిపిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో వేసిన కాంట్రాక్టర్ ఒప్పందం మేరకు తిరిగి రోడ్డు వేయించడానికి ప్రస్తుత ప్రభుత్వం కృషి చేయాలని కోరుతున్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దు

● పేద విద్యార్థినుల కోసమే గురుకుల పాఠశాల ఏర్పాటు : ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



గిరిజన గురుకుల పాఠశాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, జూన్8: త్వరలో మంచిరోజులు వస్తున్నాయని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం బాన్సువాడ మండలంలోని కోనాపూర్‌హన్మాజీపేట గ్రామాలవద్ద రూ.12కోట్లతో నూతనంగా నిర్మించనున్న గిరిజన గురుకుల బాలికల పాఠశాల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధికారం లేదని అధైర్య పడవద్దని త్వరలో మంచి రోజులు వస్తాయని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థినుల అభివృద్ధి కోసమే గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ ఆడబిడ్డ కష్టపడి చదవాలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం కోట్ల రూపాయలు మంజూరు చేసినప్పటికీ ఇతర పార్టీ నాయకులు, కాంట్రాక్టర్లను బెదిరించి సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టకుండా అడ్డుపడుతున్నారని ఆయన మండిపడ్డారు. బాన్సువాడ నియోజకవర్గంలో అభివృద్ధే ధ్యేయంగా పాటుపడుతున్నామన్నారు. కార్యక్ర మంలో జిల్లా రైతుబంధు అధ్యక్షుడు అంజిరెడ్డి, సొసైటీ చైర్మన్ సంగ్రామ్ నాయక్, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రావణ్, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

క్యాంపు కార్యాలయానికి వాస్తు దోషమేనా?

● నిరుపయోగంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ● గతంలో ఇక్కడున్న ఎమ్మెల్యే ఓటమి

● ప్రస్తుత ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు రాకపోవడంతో జోరుగా చర్చలు

ఎల్లారెడ్డి, జూన్8: రాష్ట్రవ్యాప్తంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో రూ.కోటితో అన్ని సౌకర్యాలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను నిర్మించింది. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లారెడ్డి బాన్సువాడ ప్రధాన రహదారి పక్కన నిర్మించారు. గతంలో ఎమ్మెల్యే ఉన్న ఏనుగు రవీందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 2018లో ఏనుగు రవీందర్‌రెడ్డి ఓటమిపాలయ్యారు. నిర్మాణం పూర్తయిన తరువాత 2018లో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అక్కడి నుండే కార్యకలాపాలను నిర్వహించారు. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జాజాల సురేందర్ ఓటమి చెంది కాంగ్రెస్ పార్టీకి చెందిన కె.మదన్‌మోహన్‌రావు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎమ్మెల్యేగా ఎంపిక అయినప్పటి నుంచి ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎల్లారెడ్డి - కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన ఎమ్మెల్యే సొంత కార్యాలయాన్ని నిర్మించుకున్నారు. ప్రస్తుతం అక్కడి నుండే కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

● వాస్తుదోషమే అని జోరుగా చర్చ

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వాస్తుకు విరుద్ధంగా ఉందని అందుకే కార్యాలయాన్ని వాడటం లేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. క్యాంపు కార్యాలయాన్ని శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ఓటమిపాలయ్యారు. 2018లో నిర్మాణం పూర్తయిన తరువాత మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఓటమి చెందడం ఇలా క్యాంపు కార్యాలయం శంకుస్థాపన చేసిన వారు నిర్మాణం పూర్తయిన తరువాత జాజాల సురేందర్ కార్యకలాపాలు ఇక్కడి నుండే నడిపించారు. నాయకులు ఓటమి చెందడంతో వాస్తు దోషం వల్లనే ఇలా జరిగిందని ఇలా చెప్పుకుంటున్నారు.

● పట్టించుకోని అధికారులు

క్యాంపు కార్యాలయంలోకి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు రాకపోవడంతో కార్యాలయ నిర్వహణను అధికారులు పట్టించుకోలేదు. క్యాంపు కార్యాలయ గేట్‌కు తాళం వేయలేకపోవడంతో పశువులు, కుక్కలు సంచరించాయి. అందులో ఆవరణ అంతా చిందర వందరగా ఉండేది.



క్యాంపు ఆవరణలో మేత మేస్తున్న పశువులు

● గత నెల రోజుల క్రితం నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కింద భాగంలో గత నెల రోజుల క్రితం నుంచి ఎల్లారెడ్డి డివిజన్ విద్యుత్ శాఖ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. పై అధికారుల అనుమతితో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నట్లు ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డీఈ గణేష్ తెలిపారు. ప్రస్తుతం కార్యకలాపాలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నుంచి జరుగుతున్నాయి.


చెరుకు రైతులకు అవగాహన సదస్సు



రైతుకు విత్తనాలను అందిస్తున్న అధికారులు, చైర్మన్

సదాశివనగర్, జూన్ 8: అడ్లూర్ ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చెరుకు రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సదాశివరెడ్డి మాట్లా డుతూ రైతులు అనునిత్యం నూతన టెక్నాలజీని తెలుసుకుని తమ వ్యవసాయానికి అనుసంధానం చేసుకుని అధిక దిగుబడులను పొందాలని కోరారు. సేవ స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి రత్నాకర్ తీసుకువచ్చినటువంటి తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం తయారు చేసిన మైక్రో న్యూట్రీషి యన్స్ ఫర్టిలైజర్ గురించి ఈ సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక కిలో ప్యాకెట్‌ని చెరుకు పంటకు మూడు దఫాలుగా పిచికారీ చేసుకున్నట్లయితే పంట దిగుబడి 20 శాతం పెరుగుతుందని అంతే కాకుండా గడల మధ్య దూరం పెరిగి అధిక బరువు తగ్గుతుందని చక్కర శాతం కూడా పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాగ్యలక్ష్మీ, గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ ఏవో మల్లహరి, ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ భాస్కర్, వీడీసీ అధ్యక్షుడు నర్సింలు, సీనియర్ నాయకులు పైడి జనార్ధన్, సిద్ధి రాములు, బాల్‌రాజ్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	రక్షణ
శాంతి	ఓసీ
ప్రియా 70	మనమే
ప్రియా 35	సత్యభామ

బాన్సువాడ

మహేశ్వరి	మనమే
వెంకటేశ్వర	గం గం గణేశా

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	151	219	249
వెన్‌కాబ్(కిలో)	:	162	222	260

